క్లుప్తంగా

22న హనుమాన్ శోభా యాత్ర

బేతంచెర్ల: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ఈనెల 22వ తేదీ శోభా యత్ర నిర్వహిస్తున్నట్లు హిందూ ధార్మిక సంఘాల సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు గౌరిపేట ఆంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామ పురవీధుల మీదుగా శోభాయాత్ర సాగుతుందన్నారు. హిందువులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష సరికాదు


క్యాండిల్ లైట్ పోగ్రాం నిర్వహిస్తున్న సభ్యులు

డోన్ టౌన్: సమాజంలో హెచ్ఐవీ బాధితులపై చిన్నచూపు తగదని, వారిని ఆదరించాలని హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మధుకుమార్, ముంతాజ్ అన్నారు. అంతర్జాతీయ క్యాండిల్ లైట్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక హ్యాండ్స్ కార్యాలయంలో హెచ్ఐవీతో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో షాజహాన్, మౌనిక, వనితకుమారి, రాజీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న కాటసాని రామిరెడ్డి

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. ముక్కు సంబంధిత వ్యాధితో బాధపడుతూ అనంతపురంలో ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న కాటసాని కొలిమిగుండ్లలోని మహేశ్వరరెడ్డికి ఇంటికి చేరుకుని కుమారుడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అవుకు మండల అధ్యక్షుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్ లైన్ల పరిశీలన


విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: పట్టణంలోని 1వ వార్డులో అస్తవ్యస్థంగా ఉన్న విద్యుత్ లైన్లను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. వాటిని సరిచేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్లను మంత్రి పరిశీలించారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు


నూతన వధూవరులతో కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని లింగాలలో వైఎస్సార్‌సీపీ నాయకుడు యేర్వ వెంకటశేషిరెడ్డి కుమారుడు వెంకట రవిచంద్రారెడ్డి వివాహానికి ఆదివారం పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బనగానపల్లె, నంద్యాల మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నాగిరెడ్డి, నంద్యాల విజయడెయిరీ చైర్మన్ జగన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, విజయసింహారెడ్డి, తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పట్టణంలోని కృష్ణతేజ ఫంక్షన్ హాలులో కోవెలకుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కామని మహేశ్వరరెడ్డి కుమారుడు సోమశేఖర్‌రెడ్డి వివాహ వేడుకల్లో కాటసాని రామిరెడ్డి, నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక ముక్తేశ్వర ఆలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో బ్రిడ్జిపై బైక్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయని.. పలువురు మృత్యువాత పడ్డారని తెలిపారు. శనివారం రాత్రి బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో మృతి చెందిన జానీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నిర్మాణం పూర్తయింది..
ప్రారంభమెప్పుడో

- కలచట్లలో రూ. 20 లక్షలతో ఉద్యాన రైతులకు శిక్షణాకేంద్రం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే పూర్తయిన నిర్మాణం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


ప్రారంభానికి నోచుకోని ఉద్యాన రైతుల శిక్షణా కేంద్రం

ప్యాపిలి: ప్రజాధనంతో చేపట్టిన నిర్మాణాలకు రాజకీయ గ్రహణం పట్టింది. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన అనేక భవనాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం ఆ భవనాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యతను విస్మరిస్తోంది. ఫలితంగా కోట్లాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా మారుతున్నాయి. మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పట్టు పరిశ్రమ కేంద్రాన్ని గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేశారు. ఈ భవనాన్ని ఉద్యానశాఖకు అప్పగిస్తూ ఉద్యానరైతులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించేందుకు శిక్షణా కేంద్రాన్ని నిర్మించాలని సంకల్పించారు. ఈ మేరకు రూ. 20 లక్షలు వెచ్చించి భవనం ఆధునీకరణ పనులు చేపట్టారు. పనులు పూర్తయి మరి కొద్దిరోజుల్లో ప్రారంభోత్సవం జరగాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. దీంతో ఆ భవనం ప్రారంభానికి నోచుకోలేదు.

ఉద్యాన రైతులకు మెళకువలు

డోన్ నియోజకవర్గంలో ఎక్కువ శాతం మంది రైతులు ఉద్యాన పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. వీరికి పంటల సాగులో అవసరమైన మెళకువలు నేర్పితే మంచి దిగుబడులు సాధించడంతో పాటు ఆర్థికంగా మంచి లాభాలు ఆర్జిస్తారు. కలచట్లలో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రంలోని నర్సరీల్లో మామిడి, చీనీ, జామ తదితర మొక్కలను పెంచుతారు. ఆధునిక పద్ధతుల్లో పెంచిన మొక్కలకు అంటు కట్టి రైతులకు నాణ్యమైన మొక్కలను పంపిణీ చేస్తారు. ఒక్కో బ్యాచ్‌కు 30 మంది రైతుల చొప్పున ఒక్క రోజు శిక్షణ ఇచ్చేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో ఒక ఉద్యాన శిక్షణ కేంద్రం ఉండగా నంద్యాల జిల్లాలో ఏకైక శిక్షణా కేంద్రం ఇదే.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అంతకు ముందు వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై వివక్ష చూపుతోందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే గత ప్రభుత్వం చేపట్టిన ఈ నిర్మాణాలన్నీ ప్రజల ఉపయోగం కోసం నిర్మించారన్న వాస్తవాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా కలచట్ల గ్రామంలో నిర్మించిన ఉద్యాన శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించపోవడంపై ఉద్యాన రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యాన రైతుల శిక్షణా కేంద్రాన్ని వినయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

బుగ్గన శేషారెడ్డి షటిల్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్: మాజీ ఎమ్మెల్యే రావ్‌బహదూర్ బుగ్గన శేషారెడ్డి జయంతిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు నిర్వహించే షటిల్ టోర్నమెంట్‌ను స్థానిక ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మూడేళ్లుగా షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక కృషి వల్లే డోన్‌లో షటిల్ ఇండోర్ స్టేడియం, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టులు, క్రికెట్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇవే కాక ఏడు పార్కులను ఏర్పాటు చేసి పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి పార్కులో యోగా సెంటర్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. వేసవి సెలవులను పురస్కరించుకుని బాల, బాలికలకు సమ్మర్ కోచింగ్ క్యాంపును కూడా ఏర్పాటు చేశామన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎం షరీఫ్

కోవెలకుంట్ల: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ పోరాటాలు చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం అన్నారు. ఆదివారం కడపలోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశానికి జిల్లా నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విద్యారంగంలో చేపట్టిన అసంబద్ధ, అశాస్త్రీయ విధానాలతో విద్యారంగం నిర్వీర్యమవుతుందని ఆరోపించారు. దీన్ని నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నిర్వహించ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలకు ఆర్జేయూపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతులు నిర్వహించరాదని, 1 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని, 45 మంది విద్యార్థులుంటే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలని, స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


జెడ్పీబాలికల పాఠశాలలో డెస్కులపై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: మండలంలో సోమవారం నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. మొత్తం 88 మంది విద్యార్థులు రెండు కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఇందులో స్థానిక ప్రభుత్వ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 54 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 34 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రల వద్ద అన్ని వసతులు కల్పించామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం చీఫ్ ఆఫీసర్‌గా శ్రీనివాసరెడ్డి, డీఓగా భాస్కర్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల చీఫ్ ఆఫీసర్‌గా రామస్వామి, డీఓగా రాంపుల్లారెడ్డిలను నియమించినట్లు ఎంఈఓ తెలిపారు.

జాతీయ రహదారిపై సూచిక బోర్డుల ఏర్పాటు


ఇటిక్యాల బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు


కనకాద్రిపల్లెలో ఏర్పాటు చేసిన రోడ్డు క్రాసింగ్ బోర్డు

కొలిమిగుండ్ల: అనంతపురం-అమరావతి 544-డీ జాతీయ రహదారిపై వాహనదారులకు ప్రమాదాలు, మలుపులు ఇతర అంశాలపై సమాచారం అందించేందుకు ఇటీవల ఎన్‌హెచ్ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. బెలుం సమీపం నుంచి కొలిమిగుండ్ల, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, రాఘవరాజుపల్లె, అంకిరెడ్డిపల్లె మీదుగా జిల్లా సరిహద్దు ప్రాంతం వరకు బోర్డులను వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయించారు. చాలా చోట్ల ప్రమాదకరమైన మలుపులు, ఎత్తు పల్లాలు ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొత్తగా ప్రయాణించే వాహనదారులు మలుపుల వద్ద ప్రమాదాల బారిన పడుతుండేవారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనదారుల సురక్షిత ప్రయాణానికి దోహదపడుతున్నాయి. వాహనదారులకు రహదారి మార్గాలు, మలుపులు, గమ్యస్థానాలను గుర్తించడంలో ఉపయోగపడుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల వద్ద వాహనాలు 40 కి.మీ వేగం మించరాదని సూచించే బోర్డులు అమర్చారు. బ్రిడ్జిల వద్ద బోర్డులు అమర్చారు. రోడ్డు క్రాసింగ్, స్కూల్ జోన్ తదితర వాటినే సూచించేలా బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనదారులకు చాలా మేలు కలిగిస్తుంది. రాత్రి వేళల్లో లైటింగ్‌కు సూచిక బోర్డులు స్పష్టంగా కనిపిస్తుండటంతో మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించే అవకాశాలు ఉంటాయి.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయ రంగానికి సోమవారం నుంచి వారం పాటు ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

ఈ-శ్రమ్ కార్డుతో ఎన్నో ప్రయోజనాలు

ప్యాపిలి: అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సీఐటీయూ ప్యాపిలి మండల కార్యదర్శి చిన్న రహిమాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10 లక్షల వరకు అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 6 లక్షల మంది ఈ శ్రమ్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని వారు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఈ శ్రమ్ కార్డు ఉన్న వారికి రూ. 2 లక్షల వరకు ప్రమాద బీమాతో పాటు మరిన్ని ప్రయోజనాలు ఉంటాయన్నారు. సమీపంలోని నెట్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. పట్టణ శివారులోని కుందూనది వంతెన వై జంక్షన్ వద్ద ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు. నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

ఆస్పత్రి ప్రారంభం

డోన్ టౌన్: పట్టణంలోని కర్నూలు రోడ్డులో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుంకన్న, యశోద దంపతులు నూతనంగా నిర్మించిన యశోద మల్టీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభించారు. ఈ ఆస్పత్రిని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం సందర్శించి డాక్టర్ దంపతులను అభినందించారు. ప్రారంభోత్సవంలో పట్టణానికి చెందిన రిటైర్డు జిల్లా జడ్జి బెనిక బుద్ధ నాగేంద్రరావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

రక్తదాన శిబిరం

డోన్ టౌన్: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన అభిమానులు డోన్ ఎస్కేపీ హైస్కూల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సేకరించిన రక్తాన్ని తల సేమియా బాధితుల కోసం అందించినట్లు వారు తెలిపారు.

నేడు శేషారెడ్డి జయంతి వేడుకలు

బేతంచెర్ల: పట్టణంలో రావు బహదూర్ బీపీ శేషారెడ్డి జయంతి వేడుకలను సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుగ్గన చంద్రారెడ్డి తెలిపారు. నంద్యాల, కర్నూలు క్రాస్ రోడ్డులోని శేషారెడ్డి విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులు, రోగులు, బాలింతలకు ఆదివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన రవి, మేసి ఆర్థిక సహాయంతో రొట్టెలు, గుడ్లు, పప్పు, అరటిపండులను అందజేశారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్యాపిలి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1996-97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయినులు ప్రభావతమ్మ, సామ్రాజ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు నేర్పిన ఉన్నత విలువలే తమను ఈ స్థానంలో నిలబెట్టాయన్నారు. చదువు చెప్పిన గురువులకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేశ్ నాయుడు, సుంకయ్య, ఖాజాపీర్, సోమశేఖర్, సుధాకర్, చెన్నమనాయుడు, సంజీవరెడ్డి, రామాంజనేయులు, ఖాజా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: మండల ప్రజలు స్నేహపూర్వక వాతావరణంలో జీవనం సాగించాలని.. గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమేష్ బాబుతో కలిసి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో క్షణికావేశంలో చేసిన తప్పులు మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గొడవలకు దిగితే జైలు జీవితం గడపాల్సి వస్తుందని పేర్కొన్నారు.


భారీ వర్షంతో జలమయమైన కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్

వెంటాడుతున్న అకాల వర్షాలు

- లోతట్టు ప్రాంతాలు జలమయం

కోవెలకుంట్ల: వేసవికాలంలో అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి. ఆదివారం సబ్ డివిజన్‌లోని ఉయ్యాలవాడ మండలంలో అత్యధికంగా 32.2 మి.మీ, దొర్నిపాడు మండలంలో 27.4 మి.మీ, కోవెలకుంట్లలో 23.2 మి.మీ, సంజామలలో 18.2 మి.మీ, అవుకు మండలంలో 8.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షపునీరు చేరడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలతో ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, పొగాకు, మిరప పంటలకు నష్టం చేకూరుతోంది. ఆయా పంటల్లో కోత, నూర్పిడి చేసి దిగుబడులను పొలాలు, కల్లాల్లో ఆరబోసుకున్నారు. అకాల వర్షాలతో పంట ఉత్పత్తులు తడిచిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ట


సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి మూలవిరాట్

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి, నవ గ్రహాలు, పోలేరమ్మ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. వేదపండితులు విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాణ ప్రతిష్ట చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అక్రమ అరెస్టులు

- రెడ్‌బుక్ రాజ్యాంగంతో రెచ్చిపోతున్న కూటమి సర్కార్
- ప్రభుత్వ అధికారుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం
- కర్రా దంపతులు


మాట్లాడుతున్న కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, గిరిజ

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అక్రమ అరెస్టులకు తెరలేపిందని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్లలోని వారి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బలహీన పరిచేందుకు కూటమి సర్కార్ లిక్కర్‌స్కాంను సృష్టించిందని ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. 1999లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడి హయాంలోనే సీతారామాంజనేయులు కర్నూలు ఎస్పీగా పనిచేశారన్నారు. అప్పట్లో జిల్లాలో ఫ్యాక్షనిజంపై ఉక్కుపాదం మోపి పూర్తిస్థాయిలో అరికట్టిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారన్న సాకుతో సీతారామాంజనేయులుపై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తప్పుడు వాగ్మూలాలు సృష్టించి రిటైర్డ్ అధికారులైన ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని అక్రమ అరెస్టులు చేయించడం విచారకరమన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు పాలనలోనే భారీ లిక్కర్‌స్కాం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించిన అధికారులపై కూటమి సర్కార్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని దెబ్బతీయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. కూటమి సర్కార్ ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటారన్నారు.

ప్రకటనలే తప్ప హామీల అమలేది?


మహిళలతో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం ప్రకటనలే తప్ప హామీల అమల్లో ఘోరంగా విఫలమైందని బుగ్గన అర్జున్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని తవిసికొండ గ్రామానికి వచ్చిన ఆయన్ను గ్రామ మహిళలు కలిశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తదితర హామీలు అమలు చేయడం లేదని అర్జున్‌రెడ్డి వద్ద వాపోయారు. దీనికి తోడు గ్రామాల్లోని సమస్యలను గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. మరోసారి వైఎస్సార్‌సీపీ పాలన కోసం ఎదురు చూస్తున్నామని వాపోయారు. త్వరలో మంచి రోజులు వస్తాయని బుగ్గన అర్జున్‌రెడ్డి వారికి భరోసా కల్పించారు. అనంతరం వెంకటగిరి గ్రామంలో తిమ్మారెడ్డి కుమార్తె స్వాతి, విష్ణువర్ధన్ రెడ్డి, తవిసికొండ గ్రామంలో వెంకటేశ్వరమ్మ, సతీష్ శ్వర్‌రెడ్డిల వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, నాయకులు మురళీకృష్ణ, మునేశ్వర్ రెడ్డి, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్ హుసేన్ తదితరులు ఉన్నారు.